# ప్రజాపౌరుషం

ప్రతి అక్షరం ప్రజల కోసం

APTELNO: 16315






సంపుటి: 1 | సంచిక: 8 | పేజీలు: 8 | సంపాదకులు: మక్కెన శ్రావ్య | ప్రచురణ:ఒంగోలు | వెల:రూ.8 | అక్టోబరు- 5-2023

VOLUME: 1 ISSUE: 8 PAGES: 8 EDITOR: MAKKENA SRAVYA PUBLISHD: ONGOLE OCTOBER - 5 - 2023


ప్రజల ఆరోగ్యానికి మరింత భద్రత కల్పించడమే

# జగనన్న ఆరోగ్య సురక్ష లక్ష్యం





● జిల్లా కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్

ప్రజాపౌరుషంప్రతినిధి, ఒంగోలు

ప్రజల ఆరోగ్యానికి మరింత భద్రత కల్పిస్తూ జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ చెప్పారు. టంగుటూరులోని సచివాలయం-4 పరిధిలో బుధవారం ఏర్పాటుచేసిన జగనన్న ఆరోగ్యసురక్ష శిబిరాన్ని కొండపి నియోజకవర్గ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి వరికూటి అశోక్‌బాబుతో కలిసి ఆయన పరిశీలించారు. రోగుల వివరాల నమోదు, వారికి అందిస్తున్న వైద్యసేవల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ వైద్య శిబిరాలను ఏర్పాటుచేయడానికి ముందుగానే రెండు వారాల పాటు వాలంటీర్ల సహకారంతో ఏఎన్ఎంలు ప్రతి ఇంటికి వెళ్ళి ప్రజల ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీసినట్లు చెప్పారు. బిపి, షుగర్లు, బ్లడ్‌టెస్ట్, తదితర ఏడు రకాల పరీక్షలు నిర్వహించడంతోపాటు ఇతర దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారి వివరాలను నమోదు చేసుకున్నట్లు ఆయన తెలిపారు. ప్రజల ఆరోగ్యఅవసరాలకు

మిగతా ➡ 2లో

## కళ్ళకలక ముదిరితే ఇబ్బందే



- కళ్లకలక లక్షణాలను వివరించిన డాక్టర్.కె బాలు సుమన్

5

## నగరంలో పారిశుధ్యంపై కార్పొరేటర్ల ఆందోళన



- ఒంగోలు నగర కౌన్సిల్ సమావేశంలో సమస్యలపై ఏకరువుపెట్టిన కార్పొరేటర్లు

8

## సత్యవేద సారము

100వ గది నిండిందా..?



కె రాజ్ కిరణ్ విశ్లేషణ

5

# భూ ఆక్రమణలను ఉపేక్షించేది లేదు

❖ మాజీ మంత్రి, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి

ప్రజాపౌరుషంప్రతినిధి, ఒంగోలు

భూ ఆక్రమణలలో ఎంతటి వారు ఉన్నా చట్టపరమైన చర్యలు తప్పవని బాధితులకు న్యాయం చేస్తామని ఒంగోలు ఎమ్మెల్యే, మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి అన్నారు. ఒంగోలు నగరంలో జరుగుతున్న భూ ఆక్రమణలపై బాధితులు బాలినేనిని కలిసి కొంతమంది దొంగ రిజిస్ట్రేషన్లు సృష్టించి బెదిరిస్తున్నారని ఫిర్యాదు చేశారు. స్పందించినబాలినేని అధికారులకు ఫోన్ చేసి భూ అక్రమాలకు పాల్పడుతున్న ముఠాపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. బాలినేని మీడియాతో మాట్లాడుతూ భూ అక్రమాలలో ఏ పార్టీ వారైనా అలాగే సొంత పార్టీ వారు ఉన్నా ఎంతటి వారైనా సర్వే వారిపై



చర్యలు తీసుకొని సొంత హక్కుదారులకు భూమిని అప్పగిస్తామని బాధితులకు హామీ ఇచ్చారు. కొంత మంది దొంగ పత్రాలు సృష్టించి తీసుకోవడం జరుగుతుందన్నారు. జిల్లా కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్‌తోను, జాయింట్ కలెక్టర్ శ్రీనివాసరావుతోనూ మాట్లాడటం జరిగిందని, భూ బకాసులపై కఠిన చర్యలు తీసుకోవాలని, నిందితులను గుర్తించి పోలీసులకు అప్పగించాలని రెవెన్యూ శాఖ నుంచి బాధితులకు న్యాయం అందించాలన్నారు.




## ఎన్ఐఎ సోదాలు నిలిపివేయాలి

- విరసం కళ్యాణరావు డిమాండ్

ఒంగోలు, ప్రజాపౌరుషం



తెలుగు రాష్ట్రాలలో ప్రజా సంఘాల, మహిళా సంఘాల నాయకుల ఇళ్ళలో ఎన్ఐఎ సోదాలు నిలిపివేయాలని విప్లవ రచయితల సంఘం రాష్ట్ర నాయకులు జి కళ్యాణరావు డిమాండ్ చేశారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ దళిత పీడిత కులాల సమస్యలపై, పౌర, ప్రజాస్వామిక హక్కులకై, మహిళా సమస్యలపై దశాబ్దాలుగా పని చేస్తున్న వారికి మావోయిస్ట్‌లతో సంబంధాలు అంటగట్టి సోదాల పేరుతో సెల్‌ఫోన్‌లు, లాప్‌టాప్‌లు స్వాధీనం చేసుకోవడం శోచనీయమన్నారు. మణిపూర్ ఘటనపై కెఎన్‌పిఎస్ సదస్సు నిర్వహిస్తుంటే ఓర్వలేక దాడులు చేస్తున్నారని, జిల్లాలో దుడ్డు వెంకట్రావు, ఓర్సు శ్రీనివాసరావు ఇళ్ళలో సోదాలను తీవ్రంగా ఖండిస్తున్నామని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీరు మార్చుకోకుంటే ప్రజాగ్రహం చవిచూడక తప్పదన్నారు. విలేకర్ల సమావేశంలో ఓపిడిఆర్ సుధాకర్, ఐఎల్‌పి దాసరి సుందరం, ఎస్‌డిపిఐ సత్తార్, పికెఎం కోటి, కెఎన్‌పిఎస్ శ్రీనివాస్, పౌర సమాజం గుమ్మళ్ళ నరసింహారావు, సిపిఐఎంఎల్ న్యూ డెమోక్రసీ చిట్టిపాటి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

## బిజెపికి గుణపాఠం చెబుదాం

- రైతు నేతల పిలుపు

ఒంగోలు, ప్రజాపౌరుషం



లఖింపూర్‌ఖేరి దుర్ఘటన జరిగి మూడేళ్ళు అయిన సందర్భంగా సంయుక్త కిసాన్ మోర్చా, ట్రేడ్ యూనియన్స్ జెఎసి ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట మహాధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎపి రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కెవివి ప్రసాద్ మాట్లాడుతూ నల్ల వ్యవసాయ చట్టాలపై నిరసన తెలుపుతున్న రైతుల మీదకు కేంద్ర మంత్రి కుమారుడు వాహనాన్ని దూకించి ప్రాణాలు బలిగొన్న ఘటన దేశాన్ని కుదిపి వేసిందన్నారు. ఎస్‌కెఎం జిల్లా కన్వీనర్ చుండూరి రంగారావు మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం రైతాంగానికి ఇచ్చిన హామీలు అమలు చేయకపోగా, వ్యవసాయ మోటార్‌లకు స్మార్ట్ మీటర్‌లు తీసుకొచ్చి మరింత నష్టం చేసిందన్నారు. కేంద్రం వైఖరికి నిరసనగా నవంబర్ 26, 27, 28 తేదీలలో అన్ని రాష్ట్రాల రాజధానుల లో గవర్నర్ కార్యాలయం వద్ద ధర్నా చేపడుతున్నామన్నారు. రైతు వ్యతిరేక బిజెపి ప్రభుత్వాన్ని సాగనంపడమే తమ ధ్యేయమని పలువురు పేర్కొన్నారు. కార్యక్రమంలో అఖిలభారత రైతుకూలి సంఘం చిట్టిపాటి వెంకటేశ్వర్లు, ఎపి రైతుకూలి సంఘం లలితకుమారి, ఎపి రైతు సంఘం (సిపిఐ) వి హనుమారెడ్డి, ఎపి రైతు సంఘం(సిపిఎం) పమిడి వెంకట్రావు, సుబాబుల్, జామాయిల్ రైతు సంఘం కె వీరారెడ్డి, ఎఐటియుసి కొత్తకోట వెంకటేశ్వర్లు, సిఐటియు కాలం సుబ్బారావు, వ్య.కా.సం. కంకణాల ఆంజనేయులు, ఎఐకెఎస్ నాంచార్లు, కౌలు రైతు సంఘం బాల కోటయ్య, ఐఎఫ్‌టియు మోహన్, ఎఐకెకెఎస్ భీమవరపు సుబ్బారావు, అధిక సంఖ్యలో రైతులు, రైతు కూలీలు పాల్గొన్నారు.

## ఘనంగా టెక్-మారధాన్

ఒంగోలు, ప్రజాపౌరుషం

పేస్ ఇంజనీరింగ్ కళాశాలలో ఐఇఇఇ విభాగం ఆధ్వర్యంలో టెక్-మాంధాన్ 2023 ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వైబ్రాంట్ టెక్నాలజీస్ వ్యవస్థాపకులు ఫణీంద్ర తన ప్రసంగంలో టెక్-మారధాన్ ప్రాముఖ్యత వివరించి విద్యార్థులు పరిశోధనల పట్ల దృష్టి పెట్టి ఉన్నత స్థానాలకు చేరుకోవాలన్నారు. కార్యక్రమానికి ఐఇఇఇ హెడ్ డాక్టర్ హిమబిందు అధ్యక్షత వహించగా పేస్ ప్రిన్సిపాల్ డాక్టర్ జివికె మూర్తి, డీన్ డాక్టర్ వీరాంజనేయులు, డీన్ రూప, డీన్ అప్పారావు, ఎఓ రమణబాబు, ఈవెంట్ ఆర్గనైజర్ డాక్టర్ రాజశేఖర్ పాల్గొన్నారు.





ప్రజల ఆరోగ్యానికి మరింత భద్రత కల్పించడమే

## జగనన్న ఆరోగ్య సురక్ష లక్ష్యం

తరువాయి..

తగినట్లుగా స్పెషలిస్టు డాక్టర్లతో ఈ వైద్య శిబిరాలను నిర్వహిస్తున్నట్లు వివరించారు. స్థానికంగానే అవసరమైన వైద్యంచేసి మందులు అందిస్తున్నామని, అవసరమైన వారికి ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆసుపత్రులకు పంపేలా చర్యలు తీసుకున్నామని చెప్పారు. జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. అనంతరం డిఆర్‌డిఏ ఆధ్వర్యంలో రూ.2.09 కోట్లకు పైగా విలువైన బ్యాంక్ రుణాలను, పరికరాలను లబ్ధిదారులకు కలెక్టర్ పంపిణీచేశారు. ఇందులో ఏడు స్వయం సహాయక సంఘాలకు బ్యాంక్ లింకేజీరుణాలు రూ.1.30 లక్షలు, పిఎంఈజిపి రుణాలు రూ.60 లక్షలు (టెంట్‌హౌస్, డిజెసౌండ్ సిస్టం తదితర 8 యూనిట్లు), జగనన్న బడుగు వికాసం పథకం క్రింద రూ.10లక్షలు విలువైన ట్రాన్స్‌పోర్టు కారు, 8మందికి రూ.4.48 లక్షల విలువైన టైలరింగ్ మిషన్లు, రూ.5లక్షల విలువైన 100 యూనిట్ల పెంపుడు కోళ్ళను లబ్ధిదారులకు అందించారు. ఈ కార్యక్రమంలో డిఆర్‌డిఏ, మెప్మాపిడి రవికుమార్, నియోజకవర్గ స్పెషల్ ఆఫీసర్ నారదముని, పలువురు అధికారులు పాల్గొన్నారు.







# స్వమిత్వ సర్వేపై ఎంపిడిఓలు ప్రత్యేక దృష్టి సారించాలి

- జిల్లా కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్

ఒంగోలు, ప్రజాపౌరుషం

స్వమిత్వ సర్వేపై ఎంపిడిఓలు ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ స్పష్టంచేశారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్ నుండి సంక్షేమం, అభివృద్ధి అంశాలపై మండలస్థాయి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎంపిడిఓలు తమ పరిధిలోని గ్రామాల్లో పర్యటించి స్వమిత్వ సర్వేలో పురోగతి వచ్చేలా ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. జిల్లాలో 69 గ్రామాల్లో ఈ సర్వే జరుగుతుందని, 43 గ్రామాల్లో గ్రౌండ్ ట్రూతింగ్, 14 గ్రామాల్లో గ్రౌండ్ వ్యాలిడేషన్, 12 గ్రామాల్లో ఆర్ఓఆర్ ప్రాసెస్‌లో ఉన్నట్లు కలెక్టర్ తెలిపారు. జగనన్న స్వచ్ఛ సంకల్పంలో భాగంగా అన్ని గ్రామ పంచాయితీలు చూడచక్కని గ్రామాలుగా మార్చడానికి వినూత్నంగా ఆలోచించి పారిశుధ్య కార్యక్రమాలు జరిగేలా చూడాలన్నారు. ఈ విషయంపై మండల ప్రత్యేక అధికారులు క్షేత్రస్థాయిలో గ్రామాలను పరిశీలించాలన్నారు. ప్రతిరోజూ ఇంటింటికి వెళ్ళి చెత్తను కచ్చితంగా సేకరించాలన్నారు. గ్రామాల్లో వీధుల వెంట చెత్త నిల్వ లేకుండా ఎప్పటికప్పుడు ఎస్.డబ్ల్యూ, పి.సి షెడ్లకు తరలించాలని ఆయన చెప్పారు. ఎస్ డబ్ల్యుపిసి షెడ్డుల నిర్మాణాలను త్వరితగతిన పూర్తిచేయాలన్నారు. ఈ విషయంపై ఎంపిడిఓలు ప్రత్యేకదృష్టి పెట్టి నిర్మాణాలు వెంటనే జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామ సచివాలయ సిబ్బంది ప్రతిరోజూ ఉదయం, సాయంత్రం బయోమెట్రిక్ హాజరును తప్పనిసరిగా వేయాలన్నారు. సర్వీసులను సంబంధించిన నగదును ఎప్పటికప్పుడు ప్రభుత్వానికి జమచేయాలని కలెక్టర్ చెప్పారు. ఈ విషయంపై ఎంపిడిఓలు ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. జలజీవన్ మిషన్ పనులు వేగంగా పూర్తి చేయాలన్నారు. ప్రభుత్వ ప్రాధాన్యభవనాలైన సచివాలయాలు, ఆర్‌బికెలు, హెల్త్ క్లినిక్‌ల నిర్మాణాలను పూర్తిచేయడానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులు ఆయన ఆదేశించారు. జగనన్న ఇళ్ళ నిర్మాణాలను డిసెంబర్ 24లోపు కచ్చితంగా పూర్తిచేయాలన్నారు. ఎంపిడిఓలు ఈ విషయంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలన్నారు. ఇంటిపట్టాలు ఇచ్చి, ఇళ్ళు మంజూరై కూడా నిర్మాణాలు ప్రారంభించని లబ్ధిదారుల పట్టాలను రద్దుచేసి వారి స్థానంలో అర్హత ఉన్న వారికి పట్టాలు ఇస్తామని కలెక్టర్ స్పష్టంచేశారు. బేస్‌మెంట్ వరకు నిర్మించి తరువాత నిర్మాణ పనులను చేపట్టని వారి పట్టాలు కూడా రద్దు చేస్తామన్నారు. కార్యక్రమంలో డిపిఓ నారాయణరెడ్డి, సిపిఓ వెంకటేశ్వర్లు, హౌసింగ్ పిడి పేరయ్య, జడ్పీ సిఈఓ జాలిరెడ్డి, డిఈఓ సుబ్బారావు, ఎస్ఇలు కొండయ్య, లక్ష్మారెడ్డి, ఇతర అధికారులు పాల్గొన్నారు.





# స్వాతంత్ర్యం సాధించిన మహనీయుడు మహాత్మాగాంధీ





*ఒంగోలు, ప్రజాపౌరుషం*

అహింస అనే ఆయుధంతో స్వాతంత్ర్యం సాధించిన మహాత్మా గాంధీ చూపిన మార్గం మనందరికీ అనుసరణీయమని జిల్లా కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్ అన్నారు. మహాత్మాగాంధీ 154వ జయంతిని పురస్కరించుకుని సోమవారం ఒంగోలు గాంధీరోడ్డులోని గ్రామ చావడి వద్ద ఉన్న గాంధీ విగ్రహానికి జిల్లా పరిషత్‌చైర్మన్ బూచేపల్లి వెంకాయమ్మ, ఏఎస్‌పి కె నాగేశ్వరరావు, ఒంగోలు ఎమ్మెల్యే బాలి నేని శ్రీనివాసరెడ్డి, ఒంగోలు మేయర్ గంగాడ సుజాత, పలువురు ప్రజాప్రతినిధులు, వివిధ సంఘాల నేతలు, అధికారులతో కలిసి పూలమాలలు వేసి పుష్పాంజలి ఘటించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ దక్షణాఫ్రికాలో వివిక్షకు వ్యతిరేకంగా పోరాటం చేసిన గాంధీ మన దేశానికి వచ్చి అహింస, సహాయ నిరాకరణ వంటి విధానాలలో పోరాటం చేసి మన దేశానికి స్వాతంత్ర్యం తీసుకు వచ్చారన్నారు. ఆయన చూపిన అహింస, సత్యాగ్రమం వంటి విధానాలు నేడు మనందరికి అనుసరణీయమార్గాలుగా మారా యన్నారు. గాంధీజీ ఆశయ స్ఫూర్తితో జిల్లాను అన్ని రంగాల్లోనూ అభివృద్ధి పథంలో నడిపించేందుకు చర్యలు తీసు కుంటామని ఆయన ప్రకటించారు. ఎమ్మెల్యే బాలి నేని మాట్లాడుతూ గాంధీకలలు కన్న గ్రామస్వరాజ్యం సాధన దిశగా రాష్ట్ర ప్రభుత్వ పరిపాలన సాగు తోందన్నారు. గ్రామ,వార్డు సచివాలయాలను ఏర్పాటుచేసి పాలనను ప్రజలకు చేరువచేసిందన్నారు. ప్రశాంతంగా ఉంటున్న ఒంగోలులో భూకబ్జాలకు పాల్పడుతూ కొందరూ అశాంతి సృష్టించేందుకు ప్రయత్నింస్తున్నారని, ఇలాంటి వారిపై కఠినచరర్యలు తీసుకోవాలని పోలీసు, రెవెన్యూ అధికారులతో ఇప్పటికే మాట్లాడినట్లు చెప్పారు. జడ్పీచైర్‌పర్సన్, మేయర్‌లు మాట్లాడుతూ గాంధీజీ జీవితాన్ని ప్రతి ఒక్కరూ ఆదర్శకంగా తీసుకోవాలని, ఆయన చూపిన మార్గం ప్రతి ఒక్కరికీ అనుసరణీయమని అన్నారు. ఈ కార్యక్రమంలో ట్రైనీ ఐఏఎస్ అధికారి శౌర్యమన్ పటేల్, ఆర్యవైశ్య కార్పొరేషన్ ఛైర్మన్ కుప్పం ప్రసాద్, ఒంగోలు డిప్యూటీ మేయర్ వేమూరి సూర్యనారాయణ, మున్సిపల్ కమిషనర్ ఎం వెంకటేశ్వరరావు, తహశీల్దార్ మురళి తదితరులు పాల్గొన్నారు.



### జిల్లా జైలు కార్యాలయంలో

## గాంధీ జయంతి వేడుకలు

*ఒంగోలు, ప్రజాపౌరుషం*

ఒంగోలులోని జిల్లా జైలు కార్యాలయంలో గాంధీ జయంతి వేడుకలను సోమవారం ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ ముఖ్య అతిధిగా పాల్గొని మహాత్మాగాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహాత్మాగాంధీ ఆశయాలను ప్రతి ఒక్కరూ కొనసాగించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన న్యాయమూర్తి భారతి, జిల్లా సబ్ జైలు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియపై సమీక్ష

*ఒంగోలు, ప్రజాపౌరుషం*



ఓటింగ్ పరికరాల యాక్సెప్టెన్స్ టెస్ట్(ఏపిటి) ప్రక్రియను బుధవారం నుంచి ప్రారంభించబోతున్నట్లు జిల్లా కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ చెపా ్పరు. రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి (సిఈఓ) ముఖేష్‌కుమార్ మీనా మంగళవారం అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ప్రకాశం భవనం నుంచి కలెక్టర్ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియపై పురోగతిని వివరించారు. జిల్లాకు రావలసిన వీవీప్యాట్లు, బ్యాలెట్ యూనిట్లు, కంట్రోల్ యూనిట్లు వచ్చినట్లు చెప్పారు. వీవీప్యాట్ల పరిశీలన ప్రక్రియ ఇప్పటికే పూర్తియిందని, అదే విధంగా బీయిలు, సియుల పనితీరు ప్రక్రియను కూడా బుధవారం నుంచి ప్రారంభిస్తామని కలెక్టర్ తెలిపారు. దీనికోసం బెంగళూరులోని బెల్ సంస్థ నుంచి ముగ్గురు ఇంజనీర్లు జిల్లాకు వస్తున్నట్లు చెప్పారు. ఈనెల 12వ తేదీ నాటికి ఏపిటి పూర్తిచేస్తామని అన్నారు. అనంతరం 16వ తేది నుంచి ఫస్ట్ లెవెల్ చెకింగ్ (ఎఫ్.ఎల్.సి) ప్రక్రియను చేపడుతామని తెలిపారు. దీనికి సంబంధించిన ఏర్పాట్లను పర్యవేక్షించడానికి ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జేసి కె శ్రీనివాసులు, మార్కాపురం సబ్ కలెక్టర్ సేతు మాధవన్, ట్రైనీ కలెక్టర్ శౌర్యమన్ పటేల్, డిఆర్ఓ ఆర్ శ్రీతల, ఇతర అధికారులు పాల్గొన్నారు.




# అరెస్టులతో ఉద్యమాలు ఆపలేరు: ఎమ్మెల్యే గొట్టిపాటి

- చంద్రబాబుకు సంఘీభావంగా 3 కి.మీ. సైకిల్ తొక్కిన గొట్టిపాటి
- రాష్ట్రంలో అన్ని వ్యవస్థలను వైకాపా ప్రభుత్వం భ్రష్టుపట్టించింది
- పోలీసులను అడ్డుపెట్టి రాష్ట్రంలో అరాచకం సృష్టిస్తున్నారు.
- వైకాపా ప్రభుత్వానికి ఓటమి భయం పట్టుకుంది
- అరెస్టులతో ఉద్యమాలు ఆపలేరు
- రాబోయే ఎన్నికలలో వైకాపా ఓటమి తధ్యం
- చంద్రబాబు నాయకత్వంలో రాష్ట్రంలో టిడిపి ప్రభుత్వం రానున్నది - గొట్టిపాటి





*అద్దంకి, ప్రజాపౌరుషం*

పోలీసులను అడ్డుపెట్టుకొని వైకాపా ప్రభుత్వం అరచాకపు పాలన సాగిస్తుందని అద్దంకి శాసనసభ్యులు గొట్టిపాటి రవికుమార్ విమర్శించారు. మంగళవారం సంతమాగులూరు మండలంలోని పుట్టావారిపాలెం జంక్షన్ నుండి కామేపల్లి వరకు భారీ సైకిల్ ర్యాలీని నిర్వహించారు. ఈ ర్యాలీలో అద్దంకి శాసనసభ్యులు గొట్టిపాటి రవికుమార్ సైకిల్‌తొక్కుతూ కార్యకర్తలను ఉత్తేజపరుస్తూ ర్యాలీకి అగ్రభాగాన నిలిచి ముందుకు సాగారు. సుమారు 3కిలోమీటర్లకు పైగా ఎమ్మెల్యే సైకిల్ తొక్కుతూ ర్యాలీలో కొనసాగారు. ముందుగా అడ్డరోడ్డు జంక్షన్‌లో కార్యకర్తలను ఉద్దేశించి ఎమ్మెల్యే రవికుమార్ మాట్లాడుతూ రాష్ట్రంలో వైకాపా ప్రభుత్వం అన్ని వ్యవస్థలను భ్రష్టు పట్టించిందని గత నెల 8వ తేదిన అర్ధరాత్రి సమయంలో కర్నూల్ పర్యటనలో రెస్టు తీసుకుంటుడగా నారా చంద్రబాబు నాయుడును అసాంఘిక శక్తులను అరెస్టు చేసారని ఎమ్మెల్యే రవికుమార్ ఆగ్రహం వ్యక్తం చేసారు. తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు ఈ పరిస్థితులలో కూడ సమన్వయంగా వ్యవహరిస్తున్నారని దానిని అలుచుగా తీసుకొని పౌరుని ప్రాథమిక హక్కుకు భంగం కలిగిస్తే తిరగబడే అందుకు వెనుకాడేది కూడ లేదని ఎమ్మెల్యే హెచ్చరించారు. నారా లోకేష్‌పై కూడ తప్పుడు కేసులను బనాయిస్తున్నారని ఆయన ఆరోపించారు. ఫైబర్ నెట్ ద్వారా కేవలం 149రూపాయాలకే కెబుల్ నెట్ కనెక్షన్ అందించి ప్రజలకు వినోదాన్ని కలిగించడమే కాక, రాష్ట్ర ప్రభుత్వానికి 900కోట్ల రూపాయాల ఆదాయాన్ని సమకూర్చిన ఘనత తెలుగుదేశం ప్రభుత్వానికే దక్కిందన్నారు. జగన్‌రెడ్డి మూర్ఖత్వంగా ఫైబర్ నెట్ ప్రాజెక్టులో అవినీతి జరిగింది అనడం ఆయన అజ్ఞానికి నిదర్శనం అని అన్నారు. రాష్ట్రంలో అన్నీ వ్యవస్థలు వైకాపా నేతల కబంధ హస్తాలలో బంధీ అయ్యాయని ఎమ్మెల్యే ఆరోపించారు. ఇసుక, మట్టి మాఫియా, నాశిరకం మందు, బియ్యం అక్రమ రవాణ, వైకాపా నేతలు పంచభూతాలను పందికొక్కులా తోడేస్తున్నారని ఆయన ఆరోపించారు. ప్రజలకు ఉపయోగపడే 27 పథకాలను టిడిపి ప్రభుత్వం ప్రవేశపెడితే వాటిని ఈ ప్రభుత్వం నిలిపివేసిందన్నారు. వైసిపి ప్రభుత్వం గద్దెదింపే రోజులు దగ్గరలోనే వున్నాయని ఓటమి భయంతో అక్రమ అరెస్టులు, అరాచకాలు అణిచివేతలకు వైసిపి ప్రభుత్వం తెగబడిందన్నారు. వైసిపి ఎన్ని కుట్రలు చేసినా రానున్న ఎన్నికలలో తెలుగుదేశం పార్టీ విజయాన్ని ఆపలేరని టిడిపి, జనసేన పార్టీల ఆభ్యర్థులు భారీ మెజార్టీలతో గెలుపొందడం ఖాయమని నారా చంద్రబాబు నాయకత్వంలో ప్రభుత్వం ఏర్పడటం, తధ్యమని అద్దంకి శాసనసభ్యులు గొట్టిపాటి రవికుమార్ స్పష్టం చేసారు.

# పరిసరాల పరిశుభ్రత సంపూర్ణ ఆరోగ్యానికి రక్ష







## - జిల్లా కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్

ప్రజాపౌరుషంప్రతినిధి, ఒంగోలు

పరిసరాల పరిశుభ్రత పాటించడం వలన సంపూర్ణ ఆరోగ్యానికి రక్షణ కలగడమే కాకుండా కాలుష్యం లేని వాతావరణం నెలకొంటుందని తద్వారా ప్రజలు అనారోగ్యాల భారిన పడకుండా జీవనం కొనసాగించవచ్చని ప్రకాశం జిల్లా కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ అన్నారు. ఆదివారం ఒంగోలు నగరంలోని 60 అడుగుల రోడ్డు సమీపంలో పోతురాజు కాలువ వద్ద నిర్వహించిన స్వచ్ఛతాహి సేవా కార్యక్రమంలో కలెక్టర్ స్వయంగా పాల్గొని అక్కడ ఉన్న పిచ్చి మొక్కలను తొలగించే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకునేందుకు ప్రతి ఒక్కరూ కొంత సమయాన్ని కేటాయించి స్వచ్ఛభారత్ కార్యక్రమంలో పాల్గొని పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని కోరారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పిలుపు మేరకు నిర్వహిస్తున్న స్చచ్ఛతాహి సేవ కార్యక్రమంలో ప్రజలందరూ భాగస్వాములు కావాలని కలెక్టర్ దినేష్‌కుమార్ పిలుపునిచ్చారు. స్వచ్ఛతాహి సేవ కార్యక్రమంలో భాగంగా జిల్లా వ్యాప్తంగా అన్ని గ్రామాలు మున్సిపాలిటీలు కార్పొరేషన్ల పరిధిలో స్థానిక పరిసరాల పరిశుభ్రత ప్రధాన్యతగా కార్యక్రమాలను చేపట్టి నిర్వహిస్తున్నామని కలెక్టర్ అన్నారు. ప్రజలు విధిగా తమతమ ప్రాంతాలలో అపరిశుభ్రంగా ఉన్న ప్రాంతాలను గుర్తించి తమ వంతు బాధ్యతగా సామాజిక సేవతో పరిసరాలను శుభ్రం చేసుకోవడం ద్వారా వాతావరణ కాలుష్యంలో మార్పులు చెందుతాయని పరిసరాలు పరిశుభ్రంగా ఉండటం కారణంగా దోమలు క్రిమిసంహారకాలు భారి నుంచి ప్రజలు రక్షణ పొందవచ్చని తెలిపారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంటే ఆహ్లాదకరమైన వాతావరణంలో ప్రజలు సుఖవంతమైన జీవితాన్ని గడపవచ్చని కలెక్టర్ దినేష్‌కుమార్ అన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న నగర మేయర్ గంగాడ సుజాత కమీషర్ ఎం.వెంకటేశ్వరరావు పారిశుధ్య సిబ్బందితో పాటు స్వయంగా పోతురాజు కాలువ పూడికతీత పనులలో స్వయంగా పాల్గొని అక్కడ చెత్తను తొలగించడమే కాకుండా పిచ్చి మొక్కలను తొలగించారు. పరిసరాల్లో అపరిశుభ్రంగా ఉన్న చెత్తను స్వయంగా తొలగించి స్వచ్ఛతాహి సేవా కార్యక్రమంలో భాగస్వాములయ్యారు. ఈ కార్యక్రమంలో మేయర్ గంగాడ సుజాత మాట్లాడుతూ ఒంగోలు నగరంలోని ప్రధాన ప్రాంతాలైన ఒంగోలు బస్టాండ్, ఒంగోలు రైల్వే స్టేషన్, ఒంగోలు నగరంలోని ప్రధాన పార్కులు, ఒంగోలు నగరంలోని చెరువులు అదేవిధంగా వాణిజ్య సముదాయాలు ముఖ్యంగా ప్రజలు ఎక్కువగా సంచరించే ప్రధాన కూడలి ప్రాంతాల్లో కార్యక్రమాలను నిర్వహించి ప్రజలకు పరిసరాల పట్ల పారిశుధ్యం పట్ల అవగాహన కల్పిస్తూ కార్యక్రమాలు రూపొందించి నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కమీషనర్ వెంకటేశ్వరరావు, కార్పొరేటర్లు, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# జగనన్న ఆరోగ్య సురక్ష పేదలకు ఒక వరం

## - జగనన్న సురక్ష ఆరోగ్య క్యాంపుల ప్రారంభ సభలలో చైతన్య





ప్రజాపౌరుషం, అద్దంకి

జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం పేదలకు ఒక వరం లాంటిదని అద్దంకి నియోజకవర్గ వైసిపి ఇన్‌చార్జి శాప్‌నెట్ ఛైర్మన్ బాచిన కృష్ణ చైతన్య అన్నారు. మంగళవారం అద్దంకి నియోజకవర్గంలోని పలు మండలాలో జగనన్న ఆరోగ్య సురక్ష మెడికల్ క్యాంపులు నిర్వహించబడ్డాయి. ఆయా క్యాంపులను బాచిన కృష్ణచైతన్య ప్రారంభించారు. ముందుగా సంతమాగులూరు మండలం, ఎల్చూరు సచివాలయ పరిధిలో జగనన్న ఆరోగ్య సురక్ష మెడికల్ క్యాంపును చైతన్య ప్రారంభించారు. అదే విధంగా బల్లికురవ మండలం మల్లాయిపాలెం మండల పరిషత్ పాఠశాలలో ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష మెడికల్ క్యాంపును ప్రారంభించారు. పంగులూరు మండలం బైటమంజులూరు పాఠశాలలో కూడ జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపును ఆయన ప్రారంభించారు. అద్దంకి పట్టణంలోని ప్రకాశం బాలికల ఉన్నతపాఠశాలలో కూడ జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరాన్ని చైతన్య ప్రారంభించారు. ఈ సందర్భంగా యా సభలలో చైతన్య మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా వైద్యశాఖలో పెను సంస్కరణలను ప్రవేశ పెట్టి ప్రతి కుటుంబం వైద్యఆరోగ్యశాఖ సిబ్బంది పర్యవేక్షణలో ఉండే విధంగా కుటుంబ డాక్టర్ విధానాన్ని తీసుకొచ్చారు అన్నారు. అందులో భాగంగానే జగనన్న సురక్ష ఆరోగ్య క్యాంపులను పెద్ద ఎత్తున ప్రతి గ్రామంలో నిర్వహిస్తున్నట్లు చైతన్య పెర్కొన్నారు. ఆయా మెడికల్ క్యాంపులలో వైద్యసిబ్బంది, డాక్టర్‌లు పాల్గొన్ని పలువురికి పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి ఉచితంగా మందులను పంపిణీ చేసారు. ఆయా కార్యక్రమాలలో చైతన్య వెంట ఆయా మండలాల ప్రజా ప్రతినిధులు వైసిపి నాయకులు, వైద్యఆరోగ్యసిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



# ఏపి చరిత్రలో ఇటువంటి పాలన ఎప్పుడు చూడలేదు - గొట్టిపాటి

ప్రజాపౌరుషం, అద్దంకి



ఆంధ్ర ప్రదేశ్ చరిత్రలో ఇటువంటి ప్రజా వ్యతిరేక పాలనను ఎప్పుడూ చూడలేదని, రాష్ట్ర ప్రజలు జగన్ మోహన్‌రెడ్డి పాలనను చీదరించుకుంటున్నారని అద్దంకి శాసన సభ్యులు గొట్టిపాటి రవికుమార్ విమర్శించారు. అదివారం అద్దంకిలో చంద్రబాబుకు మద్దతుగా మేము సైతం అంటూ గత 19 రోజులుగా జరుగుతున్న రిలే నిరహార దీక్షలో భాగంగా ఎమ్మెల్యే రవికుమార్ దీక్షలో పాల్గొన్ని సంఘీభావం ప్రకటించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రవికుమార్ మాట్లాడుతూ ప్రతిపక్ష నేతలను లక్ష్యంగా ఎంచుకుని, కుట్రలు పన్ని అక్రమ కేసులు పెట్టి ఈ ప్రభుత్వం దారుణంగా హింసహిస్తుందని ఆయన విమర్శించారు. దేశంలోనే సీనియర్ రాజకీయ నేత అయిన చంద్రబాబు నాయుడుపై పగబట్టి కక్ష పూరితంగా ఈ ప్రభుత్వం వ్యవహరిస్తుందని అన్నారు. రాష్ట్రంలో వైకాపా ప్రభుత్వం ఏర్పడిన నాటినుండి ప్రజా వ్యతిరేక విధానాలను అవలంభిస్తూ, పన్నులను ఇబ్బడిముబ్బడిగా పెంచుతూ, అటు విద్యుత్, ఇటు అర్‌టిసి, నిత్యావసర సరుకులపై అదుపు లేని ధరలతో ప్రజలు విసుగెత్తిపోయారని అన్నారు. ఈ పరిస్థితులలో రాష్ట్రంలో జగన్‌రెడ్డి పాలన త్వరలో అంతమోతుందని ఆయన పేర్కొన్నారు. గత రాత్రి అద్దంకి నియోజకవర్గ వ్యాప్తంగా మోత మోగిండ్దా అనే కార్యక్రమాన్ని విజయవంతం చేసి ప్రతి కార్యకర్తకు ఎమ్మెల్యే రవికుమార్ కృతజ్ఞతలు తెలిపారు.

# సత్యవేద సారము

## 100వ గది నిండిందా..?

ఒంగోలు, ప్రజాపౌరుషం

సరిపోతుంది. ఇక చాలు అక్కర్లేదు ఈ పదాలు మాట్లాడటానికి మనిషి ప్రయత్నిస్తూనే ఉంటాడు గానీ జీవిత చరమాంకం వరకు కూడా వాటిని పలకలేదు అలాగే తన జీవితాన్ని ముగిస్తుంటాడు. చాలు అనటం తృప్తి అయితే ఎప్పటికి ఆ మాటను చేరుకోలేకపోవుటయే అసంతృప్తి. అసంతృప్తితో కూడిన జీవితం నిజంగా శాపగ్రస్తం. తృప్తి కలిగి జీవించుట దేవుని ఆశీర్వాదం, దృప్తి లేని వారి గూర్చి బైబిల్ ఇలా సెలవిస్తుంది(ప్రసంగి 1:8) చూచుట చేత కన్ను తృప్తిపొందుకున్నది, వినుట చేత చెవికి తృప్తికలుగుట లేదు. ఎంత పేరు, డబ్బు, కీర్తి సంపాదించిన మనిషికి తృప్తి కలుగుట లేదు. ఎన్ని సంవత్సరాలు ఈ భూమి మీద జీవించిన తన ఆయుష్షు విషయమై తృప్తి లేదు. ఇక చాలు అనుట నిజంగా మనిషికి ఒక పెద్ద సవాలు. చాలును అననివి ఏమనగా (సామెతలు 30:16) పాతాళము, కనని గర్భము, నీరు చాలును అనని భూమి, చాలును అననవి అగ్ని, కోరికల ఉత్పత్తి కేంద్రంగా మారిన మానవ హృదయం మానవ జీవితాన్ని పాతాళంలా కనని గర్భములా అగ్నిలా భూమిలా మార్చివేస్తుంది. అసంతృప్తితో లేని వాటిని గూర్చి ఆలోచన చేస్తూ ఉన్న వాటిని కోల్పోతున్నాడు. వర్తమానంలో దేవుడనుగ్రహించిన వాటిని గూర్చి వాటిని కోల్పోతున్నాడు. వర్తమానంలో దేవుడనుగ్రహించిన వాటిని గూర్చి సంతోషింపక భవిష్యత్తును గూర్చి వింత పడేవారు కొందరైతే, వాస్తవంలో కాక ఊహల్లో బ్రతుకుచు వర్తమానాన్ని కోల్పోతున్న వారు మరికొందరు ఎప్పుడో విన్న ఒక కథ మీకు చెప్పాలనిస్తుంది. అనగనగా ఒక వ్యక్తి పేలాల పిండి మట్టి కుండలో పెట్టుకుని అమ్ముకుని జీవిస్తూ ఉండేవాడు. ఊర్లో తిరిగి పేలాల పిండి అమ్ముతూ తాను చూసిన పెద్దపెద్ద భవంతులను, అంధమైన వస్తువులను చూస్తూ తనకు కూడా ఇవన్నీ ఉంటే ఎంత బాగుండు అని ఆలోచిస్తూ అసంతృప్తితో ఉండేవాడు. ఒక రోజు పేలాల పిండి కొంత అమ్మి మధ్యాహ్నాం వేళ విశ్రాంతి తీసుకోవడానికి పేలాల పిండి కుండను చెట్టు కొమ్మకు కట్టి చేతి కర్రను పక్కన పెట్టుకొని ఆలోచిస్తూ మెల్లగా నిద్రలోకి జారుకున్నాడు. తనకు వివాహమై ఇద్దరు పిల్లలు పుట్టి తాను పెద్ద భవంతిలో ఉన్నట్లు కలగన సాగాడు. తాను ఒక జమిందారు అయినట్టు తాను వెళ్తుంటే ఇరువైపులా సేవకులు నడుస్తున్నట్లు కల కొనసాగుతూ ఉంది. ఇంతలో పని ఉండి తన సేవకుని ఎవరక్కడ అని పిలిచాడు. చిత్తం ప్రభుత్వ అంటూ వెంటనే స్పందించని సేవకుని మీద కోసం వచ్చి కర్ర విసిరి వేశాడు కలలో. కలలో మాత్రమే కాదు నిజంగా కూడా నిద్రించేటప్పుడు తన దగ్గర పెట్టుకున్న చేతి కర్రను తీసి చెట్టుకొమ్మకు కట్టిన పేలాల పిండి కుండ మీద విసిరాడు. కుండ పగిలింది, పేలాల పిండి నేలపాలయ్యింది. అప్పటికి గాని మెలుకువ రాలేదు. వాస్తవంలో జీవించలేని మనుషుల జీవితాలు ఇలాగే నేలపాలు అయిపోతాయి. రోమన్ సైనికులు ఒక సారి ఏసుప్రభు దగ్గరకు వచ్చి ఇలా అడిగారు.. నీ కృపకు పాత్రులగుటకు మేమేమి చేయవలెను..?(లూకా సువార్త 3:14) అందుకు ఆయన ఎవనిని బాధపెట్టకయు, ఎవని మీదను అపనింద వేయకయు, మీ జీవితంతో తృప్తిపొందియుండుడని వారితో చెప్పెను. అవినీతికి, లంచగొండితనానికి కారణం అసంతృప్తి అని చెప్పకనే చెప్పారు. అసంతృప్తి ఒక పాపం, ఒక వ్యక్తి నీతిగా, యదార్థవంతుడిగా, నమ్మకస్తుడిగా ఉన్న దానితో బ్రతుకుటలో తృప్తి పొందాలి. ఒక తత్వవేత్త ఇలా చెప్పాడు, మానవ హృదయాన్ని 100 గదులుగా విభజిస్తే, 99 గదులను ఈ భూప్రపంచంలో సంపాదించగలిగే వాటితో నింపగలవు. కానీ ఎన్నటికి నీవు సంసాదించే వాటితో నింపలేని 3 100వ గదే ఆధ్యాత్మికం, ఆ గది కేవలం మానవుడు తనను సృజించిన దేవునితో నింపగలిగితే మాత్రమే మానవ హృదయం తృప్తితో నిండుకుంటుంది. ఆ ఒక్క గదిని నింపగలిగితే మిగిలిన 99 గదులు కూడా నిండుకుంటాయి అన్న సత్యాన్ని గ్రహించగలుగుటయే తృప్తికి మూలం. ఈ 100వ గదిని సరిగా నింపిన వారు మాత్రమే మాట్లాడగలిగిన ఒక అద్భుతమైన వచనం. (1తిమోతి 6:8) అన్నవస్త్రములు గలవాడనైయుండి వాటితో తృప్తి పొందియుందును.



కె రాజ్ కిరణ్

# కళ్లకలక

ఒంగోలు, ప్రజాపౌరుషం

మన దైనందిన జీవితంలో వాయు కాలుష్యం పెరిగిపోయింది. ఇంతకు ముందు కంటే ఉష్ణోగ్రతలు భాగా పెరిగిపోయాయి. మునుపు కంటే వానలు, వరదలు పోటెత్తుతున్నాయి. ఈ మారుతున్న కాలం వలన ఇప్పుడు అడినో వైరస్‌లతో తలెత్తే కళ్లకలక(కన్‌జన్‌క్టివైటీస్) దేశమంతా వేగంగా విస్తరిస్తోంది. ఇది ఒకరి నుంచి మరొకరికి తేలికగా వ్యాపిస్తుంది. కళ్లకలక నిజానికి మామూలు సమస్యే. ఎక్కువ ఇబ్బంది పెట్టకుండా ఒకట్రెండు వారాలో దానంతటదే తగ్గిపోతుంది. అలాగని నిర్లక్ష్యం తగదు. అరుదుగా అయినా కొంత మందిలో ఇది కొన్ని విపరీతమైన సమస్యలకు దారితీయొచ్చు. అందువలన కొన్ని జాగ్రత్తలు తీసుకోవడం మంచిది. ఇది మన ద్వారా ఇతరులకు పాకకుండా చూడటము మన బాధ్యతని గుర్తించాలి. మన కంట్లో తెల్లగుడ్డు మీద పారదర్శక పొర(కనజన్‌క్టైవా) పరుచుకొని ఉంటుంది. ఇది కన్నీరు, జిగురు ద్రవం ఉత్పయేలా చేసి, కన్ను తడిగా ఉండటానికి తోడ్పడుతుంది. చూపు బాగుంటటానికి తడి చాలా కీలకం. ఎందుకంటే నల్లగుడ్డు(కార్నియా) పొడిబారితే చూపు పోతుంది. కన్నీటిలోని లైసోజోమ్ అనే ఎంజైమ్ బ్యాక్టిరియా, వైరస్‌లను నిలువరిస్తుంది. దీన్ని కంటి నిండా విస్తరించేలా చేసేది కన్‌జన్‌క్టైవానే. ఈ పొర ఉబ్బటమే కళ్లకలలకు దారి తీస్తుంది. దీనికి బ్యాక్టీరియా, వైరస్, అలర్జీల వంటివేవైనా కారనం కావచ్చు. ప్రస్తుతం ఎక్కువగా కనిపిస్తున్న కళ్లకల కకు కారణం ఆడినో వైరస్‌లే.

**ఆడినో వైరస్ కళ్లకలక మూడు రకాలుః**

**ఎపిడమిక్ కెరటోకన్‌జన్‌క్టివైటిస్(ఈకేసీ)ః**

ఇది మహమ్మారిలా విజృంబించే రకం. తీవ్రమైన సమస్య ఇదే. ఇందులో జ్వరమేమి ఉండదు. కళ్ల ఎరుపెక్కడం, నీరు కారటం ఎక్కువగా ఉంటాయి. సాధారణంగా ఒక కన్నుకే వస్తుంది. ఒకరి నుంచి మరొకరికి తేలికగా



అంటుకుంటుంది. ఆఫీసులో ఇంట్లో, బడిలో ఒకే సమయంలో ఎక్కువ మందికి వస్తుండటం దీని ప్రత్యేకత.

**ఫైరింగో కన్‌జన్‌క్టైవల్ ఫీవర్ః**

ఇందులో కాస్త జ్వరం, కొద్దిగా గొంతు నొప్పి, ఒక మాదిరిగా కళ్లకళక ఉంటాయి.

**ఫాలిక్యూలర్ కనజన్‌క్టివైటిస్ః**

ఇది మామూలు సమస్య. ఇందులో కళ్లు ఎర్రబడటం, నీరు కారటం వంటివి కనిపిస్తాయి.

**ముదిరితే ఇబ్బందేః**

కళ్లకలక చాలా వరకు తేలికైన సమస్యే. కానీ కొందరిలో తీవ్ర దుష్ప్రభావాలకు దారి తీయొచ్చు. కళ్లకలక ముదిరితే కనురెప్ప కంటిపొర వాపు తలెత్తుతుంది. ఇంకా తీవ్రమైతే కంటి లోపల పొర(మెంబ్రౌన్) లాంటిది ఏర్పడుతుంది. మెంబ్రైన్‌ను తొలగిస్తే తప్ప ఉపశమనం కలగదు. ఈ పొరతో చిక్కేంటంటే ముమ్ముందు కళ్ల పొడిబారటం(డ్రైఐస్)నల్లగుడ్డు ముందుభాగం(కార్నియా) వాపు వంటి సమస్యలు తలెత్తటం, కార్నియా వాపు(కెరటైటీస్) ఒక పట్టానా తగ్గదు. మూడు నాలుగు వారాల వరకు వేధించవచ్చు. కార్నియా మీద మచ్చలా ఏర్పడవచ్చు. అందుకే కళ్లకలక తగ్గకుండా వేధిస్తుంటే వెంటనే కంటి డాక్టర్‌ను సంప్రదించాలి.



డాక్టర్.కె బాలు సుమన్

**నివారణే కీలకంః**

కళ్లకలక ఒకరి నుంచి మరొకరికి తేలికగా, త్వరగా వ్యాపిస్తుంది. కుటుంబంలో ఒకరికి వస్తే అందరికి అంటుకోవచ్చు. కాబట్టి కళ్లకలక వచ్చిన వారు విడిగా ఉండటం చాలా ముఖ్యం. ఉద్యోగులు, ఆఫీసులకు విద్యార్థులు బడులకు వెళ్లొద్దు. ఇంట్లోనే వేరే గదిలో ఉండాలి. నల్లకళ్లద్దాలు ధరించాలి. చేతులతో కళ్లను నులమటం తగ్గుతుంది. ఇది ఇతరులకు అంటుకోకుండానూ నిలువరిస్తుంది. చేతులను తరచూ సబ్బుతో శుభ్రం చేసుకోవాలి. కళ్లకలక వచ్చిన వారు తమ దుప్పటి తువ్వాలు వంటివి విడిగా పెట్టుకోవాలి. ఫోన్ వంటి పరికరాలు షేర్ చేసుకోవద్దు. సాధారణంగా వైరల్ కళ్లకలక ఒక కంటికే వస్తుంటుంది. దీన్ని తాకిన చేతిని మరో కంటికి తగలకుండా చూసుకుంటే రెండో కంటికి అంటుకోకుండా కాపాడుకోవచ్చు.

**కళ్లకలక లక్షణాలుః**



కళ్లు ఎరుపెక్కడం, నీరు కారటం, లోపలేదో గుచ్చుకుంటున్నట్లు అనిపించడం, దురద, నొప్పి, వెలుతూరు చూడలేకపోవడం.

**చికిత్సః**

నిజానికి వైరల్ కళ్లకలకకు మారిటీవైరల్ మందులేవి లేవు. కాబట్టి తరచూ శుభ్రం చేసుకోవడం ముఖ్యం. శుభ్రం చేసుకోవడానికి ఉడకపెట్టిన దూదిని వాడితే ఎంతో మంచిది. తాత్కాలిక ఉపశమనానికి కృత్రిమ కన్నీరు(లూబ్రికేషన్) చుక్కల మందు, బ్యాక్టీరియా ఇన్‌ఫెక్షన్ తలెత్తకుండా యాంటీబయాటిక్ చుక్కల మందు ఉపయోగపడతాయి. దురద వాపు ఉన్నట్లయితే యాంటిహిస్టమిన్, పారాసిటమాల్ మాత్రలు మేలు చేస్తాయి.

## యువకునికి భరోసాఇచ్చిన కలెక్టర్

ఒంగోలు,ప్రజాపౌరుషం



కిడ్నీ ట్రాన్స్‌ప్లాంటేషన్ చేయించుకున్న యువకునికి ఉద్యోగం ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని డిఎంహెచ్ఓ రాజ్యలక్ష్మిని జిల్లా కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ ఆదేశించారు. కుటుంబానికి అవసరమైన ఆర్థిక సహాయం కూడా అందిస్తామని ఆ యువకునికి భరోసాఇచ్చారు. కొనకనమిట్ల మండలం నాగిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన వి మార్తమ్మకు ఇద్దరు కుమారులు, భర్త చనిపోవడంతో కూలీపనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. ఆమె పెద్ద కుమారుడు శ్రీనివాసులు బిఎస్‌సి నర్సింగ్ చేశారు. అయితే అతనికి ఒక కిడ్నీ పూర్తిగా పాడయిపోయిందని, ట్రాన్స్‌ప్లాంటేషన్ చేయించుకోవాలని వైద్యులు చెప్పడంతో ఇందుకు అవసరమైన సహాయం చేయాలని ఈ ఏడాది ఏప్రిల్‌లో వైఎస్ఆర్ ఈబిసి నేస్తం కార్యక్రమంలో పాల్గొనటానికి మార్కాపురం వచ్చిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కలిసి ఆమె విజ్ఞప్తిచేశారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం ఆర్థిక సహాయం చేయడంతో మార్తమ్మ కిడ్నీని వైద్యులు ఆమె కుమారునికి ట్రాన్స్‌ప్లాంటేషన్ చేశారు. ప్రస్తుతం కుమారుడు శ్రీనివాస్ కోలుకుంటున్నాడని, ఒక కిడ్నీతోనే ఉంటున్న తాను గతంలో మాదిరిగా శారీరక శ్రమ చేసే పరి స్థితిలేదని, తమ కుటుంబాన్ని ఆదుకోవాలని బుధవారం కలెక్టర్‌ను కలిసి మార్తమ్మ విన్నపంచేశారు. దీనిపై కలెక్టర్ స్పందిస్తూ ప్రభుత్వం తరుపున ఆర్థిక సహాయం అందేలా చూస్తామని మార్తమ్మకు ధైర్యం చెప్పారు. ఆమె కుమారునికి వైద్యశాఖలో ఉద్యోగం ఇప్పిస్తామన్నారు. ఈ దిశగా చర్యలు తీసుకోవాలని డిఎంహెచ్ఓను ఆయన ఆదేశించారు. మార్తమ్మ, ఆమె కుమారుడు కలెక్టర్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

## చిన్న వయసు నుంచే బైబిల్ పాఠాలు అనుసరించాలి

*చీరాల, ప్రజాపౌరుషం*



సెయింట్ మార్క్స్ లూథరన్ బ్రాంచ్ పేరాలలో వన్డే సండే స్కూల్ రిట్రీట్ కార్యక్రమం సండే స్కూల్ సూపరింటెండెంట్ చుక్కా బ్యూలా లారెన్స్ ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. దయ హృదయం అనే అంశంపై ఈ కార్యక్రమం నిర్వహించామని ఆమె తెలిపారు. ముందుగా సెయింట్ మార్క్స్ సెంటీనరి లూథరన్ చర్చ్ అడిషనల్ పాస్టర్ పి.దేవదాసు ప్రార్ధనతో కార్యక్రమాన్ని ప్రారంబిచారు. ఈ కార్యక్రమంలో పాటల పోటీలు, ఫప్పీట్ షో, బైబిల్ గేమ్స్, బైబిల్ క్విజ్ పోటీలు నిర్వహించి గెలుపొందిన చిన్నారులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో సండే స్కూల్ సూపరింటెండెంట్ బ్యూలా లారెన్స్ వైస్ సూపరింటెండెంట్ హేమలత, ఎం.భాగ్యరాణి, సెక్రటరీ బ్లెస్సి పాల్, చంద్, జాయింట్ సెక్రటరీపై అరుణ, కే.జయశ్రీట్రెజరర్, పి.రిచ్చి జాయింట్ ట్రెజరర్ పి.రత్న, ఎన్.వినోద్, సండే స్కూల్ పిల్లలు పాల్గొన్నారు.

## మెరిసిన మృతగాయపురి ముత్యం

*చీరాల, ప్రజాపౌరుషం*



వేటపాలెం గ్రామంకు చెందిన పొన్నూరి భరత్ కెమెస్ట్రీ విభాగం నందు పీహెచ్‌డీ సాధించారు. ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం గుంటూరు సైన్స్ కళాశాల పరిధిలోని రసాయన శాస్త్ర విభాగంలో పరిశోదన గ్రంధాన్ని సమర్పించినందుకు పీహెచ్‌డీ డిగ్రీని ప్రధానం చేసినట్లు పరిశోధన సమన్వయకర్త డాక్టర్ పి.కిరణ్మయి తెలిపారు. ఈసందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ భరత్ చిన్నతనం నుండి ఇప్పట ఇవరకు నిత్య విద్యార్థిగా ఉన్నారని, గతంలో జాతీయ స్థాయి సీఎస్ఐఆర్, యుజీసీఎస్, ఈటీ, రాష్ట్ర స్థాయి ఏపీఎస్ ఈటీలను అలవోకగా సాధించారని కొనియాడారు. భవిష్యత్తులో ఇంకా ఎన్నో కోరుకుంటూ భరత్‌కు శుభాకాంక్షలు తెలిపారు.

## 108 వాహనాల్లో ఉద్యోగావకాశాలు

*చీరాల, ప్రజాపౌరుషం*

బాపట్ల జిల్లాలో అరబిందో ఎమర్జెన్సీ 18 వాహనాల్లో ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్(ఈఎంటీ) పోస్టులకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా మేనేజర్ పి.బాలకృష్ణ సోమవారం ప్రకటనలో తెలిపారు. జీఎన్ఎంబీఎస్‌సీ లైఫ్ సైన్సెస్, బిఫార్మసీ బీఎస్సీ నర్సింగ్, డీఎంఎల్‌టీ తదితర కోర్సులు చేసిన వారు ఈ పోస్టులకు అర్హులని తెలిపారు. అర్హులైన అభ్యర్థులు ఈనెల ఆరోవ తేదీ లోపు చీరాల ఏరియా ఆసుపత్రిలోని108 కార్యాలయంలో దరఖాస్తులు అందజేయాలని కోరారు. మరిన్ని వివరాలకు 8309530078ను సంప్రదించాలన్నారు.

## స్పెషల్ డ్రైవ్‌లో సత్ఫలితాలు

*ఒంగోలు, ప్రజాపౌరుషం*

గాంధీ జయంతి పురస్కరించుకొని స్త్రీ,శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో వీధిబాలల గుర్తింపు కోసం స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. అన్ని లైన్ డిపార్ట్‌మెంట్‌ల సహకారంతో గత ఏడాది 49 మంది వీధిబాలలను గుర్తించగా, తల్లిదండ్రులకు కౌన్సిలింగ్ ఇచ్చి ప్రస్తుత విద్యాసంవత్సరంలో పాఠశాలల్లో చేర్పించారు. ఈ సందర్భంగా జిల్లా స్త్రీ,శిశు సంక్షేమ శాఖ అధికారి కె మాధురి మీడియాతో మాట్లాడుతూ ఈనెల 10 తేదీ వరకు స్పెషల్ డ్రైవ్ ఉంటుందని, వీధిబాలలను గుర్తించి పాఠశాలల్లో చేర్పిస్తామన్నారు. విద్యాహక్కు చట్టం అనుసరించి బడి ఈడు పిల్లలను పనులకు పంపరాదని,తల్లిదండ్రులు బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. బాలలను పనులలో పెట్టుకున్న వారిపై చట్టపరమైన చర్యలు ఉంటాయన్నారు. కార్యక్రమంలో డిసిపిఓ దినేష్,పిఓఎన్ఐసి ప్రమోద్,ఔట్ రీచ్ వర్కర్స్,సార్డ్స్ సభ్యులు పాల్గొన్నారు.

# ఎస్సీ,ఎస్టీ,బీసీ మైనార్టీ ఐక్యత కొరకే యాత్ర: విజయ్‌కుమార్

**- విజయ్‌కుమార్ ఐక్యత విజయపథం యాత్రకు టంగుటూరులో ఘనస్వాగతం**

*టంగుటూరు, ప్రజాపౌరుషం*



ప్రకాశం జిల్లా మాజీ కలెక్టర్‌గా పనిచేసిన మాజీ ఐఏఎస్ అధికారి అయిన విజయ్‌కుమార్ ఐక్యత విజయపథ యాత్రకు టంగుటూరులో సోమవారం దళిత బహుజనులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా టంగుటూరు బస్టాండ్ సెంటర్లోని మహనీయులైన డాక్టర్ బీఆర్ అంబేద్కర్, డాక్టర్ జగ్జీవన్‌రామ్ జ్యోతిరావు పూలే విగ్రహాలకు పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా బస్టాండ్ సెంటర్లో అంబేద్కర్ విగ్రహం వద్ద ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని దళిత, ఎస్సీ,ఎస్టీ,బీసీ, మైనార్టీల ఐక్యత కొరకై ఐక్యత విజయపథ తడ నుండి 50వ రోజు అయిన టంగుటూరు చేరుకోవడం జరిగిందన్నారు. సుమారు 900కిలోమీటర్లు పాదయాత్ర చేసినట్లు ఆయనతెలిపారు.ఈ సందర్భంగా ఎస్సీ,ఎస్టీ,బీసీ మైనార్టీలు సమాజంలో ఐక్యత కొరవడిందని, వారి ఐక్యత కొరకు వారి అభివృద్ధి సాధన కొరకు ఐక్యత విజయపథం యాత్ర చేస్తున్నట్లు ఆయన తెలిపారు. అనంతరం ఆయన అంబేద్కర్ నగర్, అరుంధతి నగర్‌లోని అంబేద్కర్, జగ్జీవన్‌రామ్ విగ్రహాలకు నివాళులర్పించారు. టంగుటూరు బస్టాండ్ సెంటర్లో విగ్రహాలు అంబేద్కర్, జగ్జీవన్‌రామ్ విగ్రహాల ఏర్పాటుకు తాను ఎంతగానో శ్రమపడ్డానని అప్పటి మాజీ ఎమ్మెల్యే దివంగత జీవీ శేషు సహకారంతో విగ్రహాల ఏర్పాటు జరిగిందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట ఆయన సతీమణి విజయశ్రీ, విద్యుత్ శాఖ అయిన సుధీర్, టంగుటూరుకు చెందిన పీఈటీ పి.అశోక్, మండల జడ్పీటీసీ ప్రతినిధి అయిన వెంకటేశ్వర్లు, ప్రసన్న కుమార్, మహిళలు ఎస్సీ,ఎస్టీబీసీలు భారీగా పాల్గొన్నారు.

# ఆమరణ నిరాహార దీక్షకు రాష్ట్రస్థాయి నేతలు సంఘీభావం






*నాగులుప్పలపాడు, ప్రజాపౌరుషం*

జాతీయ టీడీపీ అధ్యక్షులు నారా చంద్రబాబునాయుడు అక్రమ అరెస్టుకు నిరసనగా నాగులప్పలపాడు మండలం చదలవాడ గ్రామంలో ఆమరణ నిరాహార దీక్ష మూడో రోజుకి చేరింది. నాగులుప్పలపాడు మాజీ ఎంపీపీ ముప్పవరపు వీరయ్య చౌదరి చేపట్టిన ఆమరణ నిరాహార దీక్షకు రాష్ట్రస్థాయి టీడీపీ నేతలతో పాటు పలువురు ఎమ్మెల్యేలు, జిల్లా ముఖ్య నేతలు, జిల్లా పార్టీ అధ్యక్షులు పలువురు మంగళవారం నాడు సంఘీభావం తెలిపారు. రాష్ట్ర టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యులు మాజీ మంత్రి వర్యులు నక్కా ఆనంద్ బాబు మాట్లాడుతూ సైకో పోవాలి సైకిల్ రావాలి అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. యువతలో చైతన్యం ఉంటేనే రాష్ట్రం అభివృద్ది చెందుతుందన్నారు. తొందర్లో నారా చంద్రబాబునాయుడు శ్రీరాముడు వలె బయటకు వస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. అద్దంకి ఎమ్మెల్యేగొట్టిపాటి రవికుమార్ మాట్లాడుతూ టీడీపీ బడులు, బలహీన వర్గాల ఆశాజ్యోతి పేదరికం నిర్మూలించేందుకు ఆనాడు స్వర్గీయ ఎన్టీ రామారావు నుండి నేటి చంద్రబాబు వరకు అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టిన ఘనత టీడీపీకి దక్కిందని అన్నారు. కొండపి ఎమ్మెల్యే డోలా శ్రీ బాలవీరాంజనేయస్వామి మాట్లాడుతూ రాష్ట్రంలో అరాచక పాలక పోలీసు వ్యవస్థలు అడ్డం పెట్టుకుని అక్రమాలు సాగించడం రియల్ ఎస్టేట్ వ్యాపారాలతో అక్రమాదినేదేనంగా వైసీపీ పార్టీ నేతలు కాళ్ల మీద గుచ్చుతున్నారని అన్నారు. రానున్న రోజుల్లో టీడీపీ జనసేన పార్టీ కలిపి భారీ మెజార్టీతో అధికారం చేపట్టడం ఖాయమని అన్నారు. మాజీ ఎమ్మెల్యే, టీడీపీ అధ్యక్షులు దామచర్ల జనార్ధన్ మాట్లాడుతూ ప్రకాశం జిల్లా టీడీపీ కంచుకోటని, రానున్న రోజుల్లో టీడీపీ అత్యధిక సీట్లు గెలుచుకుని చంద్రబాబుకు బహుమతిగా అందిస్తామని త్వరలోనే చంద్రబాబునాయుడు నిర్ధోషిత్వం బయటపడుతుందని తెలిపారు. జనసేన అధ్యక్షులు షేక్ రియాజ్ మాట్లాడతూ టీడీపీ పార్టీ, జనసేనలో కలిసి రాష్ట్ర స్థాయి నుండి గ్రామ స్థాయి వరకు పనిచేస్తాయని, వైసీపీ బెదిరింపులకు అరాచకాలకు భయపడాల్సిన అవసరం లేదని యువత టీడీపీకి అండగా జనసేన కుల పిలుపునిచ్చారు. సంతనూతలపాడు ఇన్‌ఛార్జి బీఎన్ విజయ్‌కుమార్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు మనోజ్‌కుమార్, మండల అధ్యక్షులు మద్దిలేటి హరిబాబు, చీమకుర్తి టీడీపీ అధ్యక్షులు గుత్తిపాటి రాఘవరావు, మద్దిపాడు మండల పార్టీ అధ్యక్షులు మండల జయంతిబాబు, మండవ రంగారావు, రాష్ట్రపార్టీ సెక్రటరీ గుమ్మడి సాయిబాబా కాకడ లక్ష్మీ వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# మల్లవరం రిజర్వాయర్ సమస్యలు పరిష్కరించాలి

**- జిల్లా కలెక్టర్‌కు ఎపి రైతు సంఘం నేతల వినతి**

*ఒంగోలు, ప్రజాపౌరుషం*



మల్లవరం రిజర్వాయర్ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి పమిడి వెంకటరావు ఆధ్వర్యంలో ప్రతినిధి బృందం జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ప్రాజెక్టు 3వ గేట్ కొట్టుకుపోయి ఏడాది దాటినా గేట్ ఏర్పాటు చేయకపోవడంతో రైతులకు నష్టం జరిగిందన్నారు. వర్షాలకు ప్రాజెక్టులోకి నీరు వచ్చినా కాలువలలో జమ్ము,చిల్లచెట్టు పెరగడంతో నీరు క్రిందికి పారడం లేదని,జంగిల్ క్లియరెన్స్ చేయించాలని కోరారు. నాగార్జున సాగర్ నుంచి 5 టిఎంసిల నీరు అధికారికంగా కేటాయించాలని, మెట్ట పైర్లు కాపాడుకోడానికి 2 టిఎంసిల నీటిని తక్షణమే విడుదల చేయించాలని విజ్ఞప్తి చేశారు.

# మున్సిపల్ కార్మికుల సేవలు విలువకట్టలేనివి: మాజీ మంత్రి బాలినేని





ప్రజాపౌరుషం, ఒంగోలు

ప్రతినిత్యం తెల్లవారక ముందే తమ తమ బాధ్యతలతో విధుల్లో పాల్గొని గ్రామస్థాయి నుండి నగర స్థాయి వరకు పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులకు మనం ఎంతో రుణపడి ఉన్నామని, మాజీ మంత్రి ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి అన్నారు. సోమవారం ఒంగోలు నగర పాలక సంస్థ కార్యాలయ ఆవరణలో మున్సిపల్ కార్మికులు సిబ్బందికి నిర్వహించిన ఉచిత వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించి కార్మికులకు హెల్త్ కిట్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో బాలినేనిమాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మున్సిపల్ కార్మికుల పట్ల సానుభూతితో ఉన్నారని ప్రభుత్వం ఏర్పడిన మొదటి రోజుల్లో మున్సిపల్ కార్మికులకు వేతనాలు పెంచే విషయంలో ఉన్నతాధికారులు చేయలేని పనులను మున్సిపల్ కార్మికులు శానిటరి సిబ్బంది నిర్వహిస్తాని వారికి వేతనాలు పెంచడంలో వనుకడుగు వేసే ప్రసక్తి లేదని అన్నారు. ప్రజల ఆరోగ్యానాలను కాపాడేందుకు మున్సిపల్ సిబ్బంది తాము ఎంత సౌకర్యాలకు గురవుతున్నప్పటికిలెక్కచేయక తమ విధులను నిర్వహిస్తూ పట్టణ గ్రామ ప్రాంతాల పారిశుద్యానికి ఆరోగ్య పరిరక్షణకు పాటుపడు తున్నారని బాలినేని అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

## దివ్యాంగు జంటలకు వైభవంగా నిశ్చితార్థ కార్యక్రమం

ప్రజాపౌరుషం, ఒంగోలు



సూర్యశ్రీ దివ్యాంగుల చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో రెండు దివ్యాంగ జంటలకు మంగళవారం ట్రస్టు కార్యాలయంలో నిశ్చితార్థ కార్యక్రమం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిధిగా ఒంగోలు నగర అభివృద్ధి కమిటీ అధ్యక్షులు మారెళ్ళ సుబ్బారావు, రాజేశ్వరి దంపతులు పాల్గొని జంటలను ఆశీర్వదించారు. ఈ సందర్భంగా మారెళ్ళ సుబ్బారావు మాట్లాడుతూ గోపి, సంతోషమ్మ వీళ్లిద్దరూ సూర్యశ్రీ దివ్యాంగుల ట్రస్టులో ఆశ్రయం పొందుతున్న దివ్యాంగలన్నారు. వీరిద్దరికి కంటి చూపు లేదని తెలిపారు. ఇద్దరు ఒకరిని ఒకరు ఇష్టపడి కలిసి జీవితం పంచుకోవాలని ఆశపడి తమ దృష్టికి తెచ్చారన్నారు. త్వరలో వీరికి పెళ్లి చేసి దంపతులుగా చేయనున్నామన్నారు. అలాగే ట్రస్టులో ఉండే ఇంకో అమ్మాయికి అంగవైకల్యంతో నడవలేని స్థితి, అయినా ఆమెను ప్రేమించి పెళ్లి చేసుకొనేందుకు ఆ యువకుడు ముందుకు వచ్చాడు. తమ శారీరక లోపాలని అధిగమించి మనసుకి నచ్చిన జోడీని వెతుక్కుని ఆనందకరమైన జీవితం గడపాలని ఈ జంటలకు త్వరలో వివాహం జరిపించనున్నామని మారెళ్ల తెలిపారు. ప్రతి ఏడాది అక్టోబరులో సంస్థలో దివ్యాంగులకు వివాహాలు జరిపించే ఆనవాయితీ ఉందన్నారు. ఈ నిశ్చితార్థ వేడుకలు ట్రస్టు నిర్వాహకులు షేక్ సర్దార్ భాషా, సాహనాజ్ దంపతుల ఆధ్వర్యంలో జరిగింది.

# పలు సేవా కార్యక్రమాల మధ్య మహాత్మాగాంధీకి నివాళి





చీమకుర్తి, ప్రజాపౌరుషం

జాతిపితమహాత్మాగాంధీ 154 జయంతి వేడుకలు చీమకుర్తి లయన్స్ క్లబ్, చీమకుర్తి ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాల మధ్య సోమవారం ఘనంగా నిర్వహించారు. డాక్టర్ జవహర్ నర్సింగ్ హోమ్ వద్ద నుంచి బస్టాండ్ సెంటర్ వరకు మెయిన్ రోడ్డు ద్వారా భారీగా ర్యాలీ చేపట్టారు. మహాత్మాగాంధీకి జోహార్లు అర్పిస్తూ నినాదాలు చేస్తూ పలు సంఘాల నాయకులు, సామాజిక కార్యకర్తలు ఇందులో భాగంగా బస్టాండ్ సెంటర్లో ఉన్న మహాత్మాగాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా కార్యక్రమాలకు అధ్యక్షత వహించిన లయన్స్‌క్లబ్ అధ్యక్షులు డాక్టర్ జవహర్ మాట్లాడుతూ మహాత్మాగాంధీ అందించిన శాంతి, అహింస, సేవభావం నేటి తరానికి స్ఫూర్తి కావాలన్నారు. ఈ సభకు గుంటూరు మెడికల్ కాలేజీ 1974 బ్యాంచ్ కు చెందిన వైద్యులు ముఖ్య అతిధులుగా విచ్చేశారు. ఒంగోలు నుంచి డాక్టర్ వై.రాజేశ్వరరావు, గుంటూరు నుంచి డాక్టర్ రమాతారక్ నాథ్ తదితరులు ఉన్నారు. వాసవి యూత్ సహకారంతో నిర్వహించిన రక్తదాన శిబిరంలో 80 మంది యువకులు పాల్గొని రక్తదానం చేపట్టారు. అద్దంకి నియోజకవర్గ పరిశీలకులు మారం వెంకారెడ్డి, చీమకుర్తి జడ్పీటీసీ సభ్యులు వేమా శ్రీనివాసరావు, ఆర్యవైశ్య సంఘం జిల్లా నాయకులు చలువాది బదిరి నారాయణ, మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు నూనె హేమసుందరం, లయన్స్‌క్లబ్ కార్యదర్శి చలువాది రమేష్, విజయ్‌కుమార్‌రెడ్డి, రావిపూడి లక్ష్మీనారాయణ, ఎస్.అంజిరెడ్డి, నూనె శివ, ఆలపాటి నరసింహారావు, తదితరులు పాల్గొన్నారు. పలు వృత్తులలో ఉత్తమ సేవలందించిన వారికి ఈ సందర్భంగా శాలువా కప్పి జ్ఞాపికలను అందజేశారు. ఉత్తమ వాలంటీర్‌గా సీహెచ్ భవాని, పి.నరసింహారావు, ఉత్తమ స్వీపర్లుగా పి.సుబ్బరత్నం, జడా పిచ్చయ్య, ఉత్తమ పోస్టుమేన్ జి.సిరివిద్య, ఉత్తమ నర్సుగా జ్యోతి, ఉత్తమ ఆశా కార్యకర్తగా ఈశ్వరమ్మ, ఉత్తమ కానిస్టేబుల్‌గా కే.సుబ్బారావు తదితరులను సత్కరించారు. ఈ సందర్భంగా చీమకుర్తి గవర్నమెంట్ ఆసుపత్రిలో భవన ఆధునీకరణకు నిధులను ఇచ్చారు. పశువైద్య కేంద్రంలో మూడున్నర లక్షలను విరాళంగా ఇచ్చారు. 150 మంది హాస్టల్ విద్యార్థులకు నైట్ డ్రస్‌లను ఎంపీపీ పాఠశాలకు వంట పాత్రలు, మొత్తం 20 రకాల సేవా కార్యక్రమాలను చేపట్టారు.

## గాంధీ మార్గమే నేటి తరానికి శిరోధార్యం - ఎయిమ్స్

ప్రజాపౌరుషం, ఒంగోలు



భారత జాతిపిత మహాత్మాగాంధీ జయంతి అక్టోబరు 2ను అంతర్జాతీయ శాంతి దినోత్సవంగా ఐక్యరాజ్యసమితి ప్రకటించిందని, దానికి అనుగుణంగా మనందరం సమాజంలో శాంతి సౌభ్రాతృత్వములను పెంపొందించేలా మెలగాలని ఆలిండియా మహాత్మాగా సోషల్‌క్లబ్స్ పూర్వ జాతీయ అధ్యక్షులు రాధా రమణ గుప్తా జంధ్యం పేర్కొన్నారు. సోమవారం గాంధీజీ, లాల్ బహుదూర్ శాస్త్రి జయంతి సందర్భంగా ఎయిమ్స్ క్లబ్ ఒంగోలు అధ్యక్షులు పబ్బిశెట్టి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో స్థానిక బాపూజీ గో సంరక్షణ సంఘం గోశాల వద్ద గల బాపూజీ విగ్రహానికి పూలమాలలు సమర్పించారు. ఈ కార్యక్రమలో ఎయిమ్స్ క్లబ్ ఒంగోలు కార్యదర్శి తమ్మపూడి ఏడుకొండలు, చీదెళ్ల వెంకట ప్రసాద్, మహేశ్వరరావు, చలువాది బ్రహ్మయ్య పాల్గొన్నారు.

## గ్రంధాలయ సంస్థ ఆధ్వర్యంలో మహాత్మాగాంధీ, లాల్‌బహుదూర్ శాస్త్రి జన్మదిన వేడుకలు

ప్రజాపౌరుషం, ఒంగోలు



జిల్లా గ్రంధాలయ సంస్థ ఒంగోలు జిల్లా కేంద్ర గ్రంధాలయం నందు సోమవారం జిల్లా గ్రంధాలయ సంస్థ కార్యదర్శి ఆదిలక్ష్మీ ఆధ్వర్యంలో జాతిపిత మహాత్మాగాంధీ 154, లాల్‌బహుదూర్ శాస్త్రి 119వ జయంతి వేడుకలను నిర్వహించారు. తొలుత వారి చిత్రపటానికి పూలమాలలు వేసినివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఉపగ్రంధపాలకురాలు బొమ్మల కోటేశ్వరి, గ్రంధాలయ సిబ్బంది కే.సంపూర్ణమ్మ, ఎం.శ్రీనివాసులు, డీ.సందీప్, పి.ఇమ్మానియేలు, కే.కృష్ణవేణి, ఎస్.అనిల్‌బాబు, ఎం.శివకుమారి, వై.మృదుల్ కుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.

## టెన్నీస్ బాల క్రికెట్ పోటీలకు క్రీడాకారులు ఎంపిక

చీరాల, ప్రజాపౌరుషం

బాపట్ల జిల్లా టెన్నీస్ బాల్ క్రికెట్ అసోసియేషన్ వారు ఆదివారం బాపట్లలో విలియంబుత్ కాలేజీలో నిర్వహించిన క్రికెట్ సెలక్షన్స్ అండర్-14, అండర్-17 కేటగిరిలో చీరాల పేరిరా ఇంగ్లీష్ మీడియం స్కూల్ విద్యార్థులు 8 మంది ఎంపికయ్యారని ప్రిన్సిపాల్ సుప్రసన్న తెలియజేశారు. వీరు ఈనెల 16,17వ తేదీ గుంటూరులో జరిగే జిల్లా పోటీలకు ఆడతారు ఎంపికైనా విద్యార్థులు అండర్-14 డి.జాన్సన్, టి.తనుష్, ఎన్.శివరాం అలాగే అండర్-17 ఎంపికైన విద్యార్థులు టి.పృద్వీరాజ్, డే.బంగారిబాబు, ఎన్.అఖిల్, బి.ప్రమోద్ కుమార్, డి.సూర్య ఎంపికయ్యారని తెలిపారు. వీరిని బాపట్ల జిల్లా అసోసియేషన్ సెక్రటరీ బాలు, సెలక్షన్ కమిటీ మెంబర్స్ అమర్నాథ్, విజ్ఞాన్ బాబు, పెరిరా స్కూల్ వైస్ ప్రిన్సిపాల్ జయలక్ష్మి, పీఈటీ శాంతి వర ప్రసాద్ అభినందించారు. గుంటూరులో జరిగే ఈ క్రీడల్లో పాల్గొని బాపట్ల జిల్లాకు మంచి పేరు తేవాలని ఆకాంక్షించారు.



జగనన్న ఆరోగ్య సురక్ష పథకం ద్వారా

# ప్రజలందరికి కార్పొరేట్ స్థాయిలో ఉచిత వైద్యం







- మాజీ మంత్రి, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి
- ఓఎంసీ ప్రాంగణంలో నిర్వహించిన వైద్య శిబిరంలో పాల్గొన్న మేయర్ సుజాత, వైసీపీ అధ్యక్షులు జంకె

ప్రజాపౌరుషం ప్రతినిధి, ఒంగోలు

పేద ప్రజలందరికి ఉచితంగా కార్పొరేట్ స్థాయి వైద్యం అందించడమే ప్రభుత్వ లక్ష్యమని మాజీ మంత్రి ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి అన్నారు. మంగళవారం ఒంగోలు నగర పాలక సంస్థ కార్యాలయ ప్రాంగణంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి, జిల్లా వైసీపీ అధ్యక్షులు జంకె వెంకటరెడ్డి, నగర మేయర్ గంగాడ సుజాతలు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిధిగా పాల్గొన్న బాలినేని శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ దేశంలోనే ఏ రాష్ట్రంలో లేని విధంగా వైసీపీ ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్ష పథకాన్ని ప్రవేశపెట్టి ఆ పథకం ద్వారా రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలకు వైద్య సౌకర్యాలను పెంపొందింపచేయడమే లక్ష్యంగా అమలు చేస్తున్నారని అన్నారు. ఆరోగ్య కార్యకర్తలు, వైద్యులు ప్రతిఇంటికి వెళ్లి ఆరోగ్య సర్వే చేయడంతో పాటు కుటుంబ సభ్యులందరి ఆరోగ్య లక్షణాలను నమోదు చేయడంతో పాటు అక్కడే బీపీ, షుగర్ వంటి వ్యాధుల పరీక్షలను కూడా నిర్వహిస్తాని వివరించారు. ఇంకా మెరుగైన వైద్య సేవల కోసం స్థానికంగా ఏర్పాటు చేసే మెడికల్ క్యాంపుల్లో వారందరిని ఆహ్వానించి పూర్తిస్థాయి రక్త పరీక్షలు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను అందజేసే కార్యక్రమం జరుగుతుందన్నారు. రాష్ట్రంలో వైద్య సేవలకు నోచుకోని ప్రజలు ఉండరాదనే దృఢసంకల్పంతో ఈ పథకాన్ని ప్రవేశపెట్టినట్లు తెలిపారు. ఈ పథకం ద్వారా రాష్ట్రంలో ఇంటింటికి పూర్తి స్థాయి వైద్య సేవలు అందుతాయన్న ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. గ్రామ వాలంటీర్ల స్థాయి నుండి ప్రభుత్వ వైద్య విభాగ సిబ్బంది వరకు ఈ కార్యక్రమంలో పాల్గొని ఇంటింటా వైద్యం వంటి ఉచిత సేవలను అందిస్తారని అన్నారు. అన్ని రకాల వ్యాధులకు సమగ్రమైన చికిత్సలను అందించేందుకు ప్రభుత్వం వైద్యశాఖలు కృషి చేస్తున్నాయని బాలినేని అన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న వైసీపీ జిల్లా అధ్యక్షులు జంకె వెంకటరెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ప్రజల కోసం అనేక సంక్షేమ పథకాలను ఇంటి వద్దనే అందజేస్తుందని ఇందులో భాగంగానే ప్రతి వారికి ఇంటి వద్దనే వైద్యం అందించేలా జగనన్న ఆరోగ్య సురక్ష పథకం అందరికి అందుబాటులో ఉంటుందని అన్నారు. ఈ పథకం ద్వారా జిల్లా వ్యాప్తంగా గ్రామ స్థాయి నుండి నగర స్థాయి వరకు అనేక రూపాయలలో మెడికల్ క్యాంపుల నిర్వహణ జరుగుతుందని, ఈ పథకం ముఖ్యంగా పేద మధ్య తరగతి ప్రజలకు సౌకర్యవంతంగా ఉంటుందని జంకే అన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న నగర మేయర్ గంగాడ సుజాత మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్ష పథకం ద్వారా వైద్య సేవలను విస్తరించేందుకు అవకాశాలు ఉన్నట్లు తెలిపారు. ఆర్థిక భారంతో అనేక అనారోగ్య సమస్యలు ఎదుర్కొంటున్న అసంఖ్యాకమైన కుటుంబాలకు ఆరోగ్య సురక్ష ఒక వరం అని అన్నారు. ఒంగోలు కార్పొరేషన్ పరిధిలో మారుమూల ప్రాంతాలలోనూ మెడికల్ క్యాంపులు నిర్వహించి ప్రజలకు వైద్య సేవలను అందజేస్తామని సుజాత తెలిపారు. అనంతరం హాజరైన ప్రజలకు ఈ శిబిరంలో వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులను ఉచితంగా అందజేశారు.

**ఒంగోలు డీఆర్ఆర్ఎం మున్సిపల్ పాఠశాల నందు:**

ఒంగోలులోని డీఆర్ఆర్ఎం మున్సిపల్ పాఠశాల నందు జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నగర పాలక సంస్థ వారు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఆరు డివిజన్లో సచివాలయాల పరిధిలో ఉన్న ప్రజలు పాల్గొన్నారు. ఈ ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో ప్రజలకు రకరకాల ఉచిత వైద్య సేవలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా జిల్లా అధ్యక్షులు జంకె వెంకటరెడ్డి, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి, నగర మేయర్ గంగాడ సుజాత, ఒంగోలు నగర వైసీపీ కార్పొరేటర్లు తదితరులు పాల్గొన్నారు.

## నగరంలో పారిశుధ్య పనులను పర్యవేక్షించిన కమీషనర్

ప్రజాపౌరుషం, ఒంగోలు

ఒంగోలు నగర పాలక సంస్థ కమీషనర్ ఎం.వెంకటేశ్వరరావు రోజువారి శానిటరి పర్యవేక్షణలో భాగంగా శానిటరి డివిజన్ 4యొక్క మస్టర్ ఆఫీస్‌ని ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ తనిఖీలో భాగంగా కమీషనర్ 4వ డివిజన్ పారిశుధ్య సిబ్బంది యొక్క హాజరు పట్టిని పరిశీలించారు. అనంతరం కొత్తపట్నం బస్టాండ్ ఏరియాలో, అద్దంకి బస్టాండ్ సమీపంలో తదితర ప్రాంతాల్లో పారిశుధ్య పనులను పర్యవేక్షించారు. సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో 43,44వ డివిజన్ కార్పొరేటర్లు, 4వ డివిజన్ శానిటరీ ఇన్‌స్పెక్టర్, 1వ డివిజన్ శానిటరి ఇన్‌స్పెక్టర్, 2వ డివిజన్ శానిటరి ఇన్‌స్పెక్టర్, శానిటరి మేస్త్రీలు, శానిటరి సిబ్బంది పాల్గొన్నారు.



## నగరంలో పారిశుధ్యంపై కార్పొరేటర్ల ఆందోళన

- ఒంగోలు నగర కౌన్సిల్ సమావేశంలో సమస్యలపై ఏకరువుపెట్టిన కార్పొరేటర్లు

ప్రజాపౌరుషం ప్రతినిధి, ఒంగోలు





నగరంలో పారిశుధ్యం అడుగంటిందని నగర వీధులు దుర్గంధంతో చెత్తాచెదారంతో నిండిపోయాయని టీడీపీకి చెందిన పలువురు కార్పొరేటర్లు ఆందోళన వ్యక్తం చేశారు. మంగళవారం ఒంగోలు నగర పాలకసంస్థ సమావేశం జరిగింది. ఈ కార్యక్రమానికి ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి ఎక్స్ అఫీషియో సభ్యుని స్థాయిలో హాజరయ్యారు. నగర మేయర్ గంగాడ సుజాత అధ్యక్షతన జరిగిన సమావేశంలో పలువురు కార్పొరేటర్లు మాట్లాడుతూ ఒంగోలు నగరంలో పారిశుధ్య పనులు సక్రమంగా జరగడం లేదని కొందరు పెత్తనం చేయడం తప్ప పనులు చేయడానికి ముందుకు రావడం లేదని ఆరోపించారు. నగరంలో శానిటేషన్ సిబ్బందిపై కొందరు కార్పొరేటర్ల అండతో పెత్తనం చేసి సిబ్బంది తప్ప బాధ్యతలను సక్రమంగా నిర్వర్తించడం లేదని ఆరోపణలు చేశారు. మరి కొంత మంది కార్మికులను ఉపయోగించుకొని అధికారులు తమ సొంత పనులను చేయించుకుంటున్నారని, అందువల్ల నగరంలో పారిశుద్యాన్ని సక్రమంగా నిర్వహించే సిబ్బంది కరువయ్యారని అన్నారు. అధికారుల తీరు మారనంతవరకు నగరంలో పారిశుధ్యం పనులు సక్రమంగా జరగవుఅని వారు ఈ సమావేశంలో తమ ఆరోపణలను చేశారు. నగరంలో కార్పొరేషన్ ఆధ్వర్యంలో చేపట్టాల్సిన కార్యక్రమాలను చిత్తశుద్ధితో నిర్వహించాలని కోరారు. ఇటీవల నియమించుకున్న మేస్త్రీల ఆదీనం నుండి పట్టణ పారిశుధ్య కార్యక్రమాలను సచివాలయాలకు అనుసంధానం చేయాలని పలువురు సూచించారు. ఈ సమావేశంలో ఒంగోలుకు సమీపంలో ఉన్న భగీరథ కెమికల్ ఫ్యాక్టరీని ఆ ప్రాంతనుండి తొలగించాలని కౌన్సిల్ సమావేశం తీర్మానించింది. ఈ కెమికల్ ఫ్యాక్టరీ కారణంగా అపరిశుభ్ర వాతావరణం నగరంలోకి చేరి ప్రజలు అనారోగ్యాల భారిన పడి దీర్ఘకాలిక వ్యాధులకు గురి అవుతున్నారని అందువల్ల ఈ ఫ్యాక్టరీని తరలించేందుకు చర్యలు తీసుకోవాలని సమావేశంలో అభిప్రాయపడ్డారు. పలువురు కార్పొరేటర్లు మాట్లాడుతూ ఈ ఫ్యాక్టరీ ఎంతో మందికి ఉపాధి కల్పిస్తుందని దీనిని తొలగించడం ద్వారా అనేక మందికి ఇబ్బందులు ఎదురవుతాయని తెలపగా ఈ ఫ్యాక్టరీ వల్ల జరిగే లాభం కంటే నష్టం ఎక్కువ జరుగుతుందని, దీనిని తొలగించేందుకు రెండు సంవత్సరాల కాలం సమయం ఇచ్చామని కావున రెండు సంవత్సరాలు పూర్తయినందున ప్రస్తుతం ఈ ఫ్యాక్టరీని ఈ ప్రాంతం నుంచి తొలగించాలని తీర్మాణించారు. ఈ సమావేశంలో పాల్గొన్న టీడీపీ, జనసేన కార్పొరేటర్‌లు నల్ల కండువాలు ధరించి సమావేశానికి వచ్చారు. ప్రభుత్వం చంద్రబాబును అక్రమ కేసులతో అరెస్టు చేసి హింసించడాన్ని నిరసిస్తూ నల్లకండువాలతో సమావేశంలో పాల్గొన్నారు. ఈ సమావేశంలో ఎక్స్ అఫీషియో సభ్యులు బాలినేని శ్రీనివాసరెడ్డిని పలువురు వైసీపీ కార్పొరేటర్లు సన్మానించారు. ఈ సమీక్ష సమావేశంలో పారిశుధ్య కార్మికులు తమకు వేతనాలు పెంచాలని, తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలంటూ బాలినేనికి వినతిపత్రం అందజేశారు.

Printed by MAKKENA SRAVYA, Published by MAKKENA SRAVYA and Owned by MAKKENA SRAVYA, Printed at Sri VInayaka Graphics and offset Printing, Door No: 19-28-319/1, Miriyalapalem Center, Trunck Road, ONGOLE-523001, AP.Published at Door No:MIG-2-222, Housing Board Colony, Near Bhagya Nagar, ONGOLE-523001, Editor: MAKKENA SRAVYA, APTEL: 16315, www.prajapourusham.org